సాక్షి
విజయనగరం

ఆదివారం । 12 । మార్చి । 2023



జోగింపేటకి జాతీయ పురస్కారం!

సీతానగరం మండలంలోని జోగింపేట పంచాయతీ జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు సర్పంచ్ కల్యంపూడి సింహాచలం తెలిపారు.

- 8లో



ఉపముఖ్యమంత్రిని కలిసిన పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ శనివారం కలిశారు.

- 8లో



పరారైన రిమాండ్ ఖైదీ అరెస్ట్

సరిగ్గా రెండు నెలల క్రితం పోలీసుల కళ్లుగప్పి, తప్పించుకుని పరారైన రిమాండ్ ఖైదీని రాజాం పోలీసులు విజయవాడలో అరెస్ట్ చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ తదితరులు

రేగిడి: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో బూరాడ జంక్షన్ వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్టును పోలీసులు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎస్‌ఐ శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది వాహనాలను శనివారం తనిఖీలు చేశారు. ఎన్నికల సందర్భంగా డబ్బులు, మద్యం తరలింపును అడ్డుకునేందుకు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

- జిల్లా డీపీఎం ఆనందరావు



చాటాయవలసలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం

రేగిడి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి పంటలను సాగు చేస్తే పెట్టుబడి తక్కువతో పాటు ఆరోగ్యవంతమైన పంటను పొందడంతో పాటు మంచి ఆదాయం వస్తుందని ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా డీపీఎం ఆనందరావు అన్నారు. మండలంలోని చాటాయవలస, గుళ్లపాడు గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పించారు. రైతులు వేసిన పంటలకు చీడపీడలు ఆశిస్తే మార్కెట్‌లో దొరికే రసాయనాలు, పురుగు మందులను వాడుతుండడంతో పంటల దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయన్నారు. ప్రీ మాన్‌సూన్, డ్రై సోయింగ్ విధానాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కరణం గోవిందరావు, వియ్యపు చక్రపాణి, రమాదేవి, ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, రమణ పాల్గొన్నారు.

రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల కేటాయింపు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్‌ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఎన్నికల సిబ్బందికి రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఎన్నికల పరిశీలకులు సిద్దార్థ జైన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆదేశించారు. ఎన్నికల విధుల్లోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ సిబ్బందిని, మైక్రో అబ్జర్వర్లను రాండమ్‌గా కేటాయించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎ.సూర్యకుమారి, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఎస్‌ఐసీ డీఐఓ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రత్యేక సెలవు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పోలింగ్ రోజున కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రత్యేక సెలవు వర్తింపజేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నిక అధికారిణి ఎ.సూర్యకుమారి తెలిపారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీతో పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో పని చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.

లక్ష్యం నెరవేరినా...
లైసెన్స్‌కు నో

సంస్కరణల బాటలో ప్రయాణించాల్సిన ప్రస్తుత సమయంలో ఏపీ ఈఆర్‌సీ పాత కాలపు విధానాలనే పట్టుకు వేలాడుతోంది. ఫలితంగా ప్రభుత్వంపై మోయలేని భారం పడుతోంది. లక్ష్యం దాటి ముందుకు వెళ్తున్న ఆర్‌ఈసీఎస్‌లకు లైసెన్సు ఇవ్వాల్సిన ఏపీ ఈఆర్‌సీ నో చెప్పింది.

- ఆర్‌ఈసీఎస్ లైసెన్స్‌కు నో చెప్పిన ఈఆర్‌సీ
- ప్రభుత్వం అనుమతిచ్చినా.. ఎందుకిలా..
- ఆర్‌ఈసీఎస్ పరిధిలో 68,573 విద్యుత్ కనెక్షన్లు
- 8717 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు



ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం

చీపురుపల్లి:

మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణల దిశగా అడుగులు వేయాలి తప్ప పాత కాలం విధానాలే అవలంభిస్తూ భారీ నష్టాలను ప్రభుత్వం భరించాల్సిన పరిస్థితులు ఉండకూడదు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక సంస్కరణలను అందిపుచ్చుకుని నష్టాలను తగ్గించుకుని వినియోగదారులకు పూర్తి స్థాయిలో విద్యుత్ సేవలు అందించాలి. ఇదే చీపురుపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(ఆర్‌ఈసీఎస్) విషయంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిక్ రెగ్యులేటరీ కమిటీ(ఏపీ ఈఆర్‌సీ) తమ నివేదికల్లో స్పష్టం చేస్తోంది. నాలుగు దశాబ్దాల కిందట గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేని సమయంలో తక్కువ ధరలకే విద్యుత్ సరఫరా చేసి ప్రతీ గ్రామానికి, ప్రతీ ఇంటికి విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(ఆర్‌ఈసీఎస్) ఏర్పాటైంది. ప్రస్తుతం ఆ లక్ష్యాలన్నీ చేధించి ప్రతీ ఇంటికి విద్యుత్ సరఫరా ఉన్న నేపథ్యంలో ఇంకా నష్టాలు భరిస్తూ ఆర్‌ఈసీఎస్ కొనసాగించాల్సిన అవసరం లేదని ఏపీ ఈఆర్‌సీ చెబుతోంది. అయితే ఇక్కడి ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా స్థానిక ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం కూడా ఆర్‌ఈసీఎస్ కొనసాగింపునకు అనుమతులు ఇచ్చింది. ఆర్‌ఈసీఎస్‌కు లైసెన్స్ మంజూరు చేయాలని ఏపీ ఈఆర్‌సీకు ప్రభుత్వం స్వయంగా లేఖ రాసింది. దీనిపై ఐదారు నెలల కిందట ఏపీ ఈఆర్‌సీ ఆన్‌లైన్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆ ప్రజాభిప్రాయ సేకరణలో దాదాపు పది వేల మందికి పైగా ఆర్‌ఈసీఎస్ కొనసాగించాలంటూ ఆన్‌లైన్‌లో స్థానిక వినియోగదారులు అభిప్రాయాలు పంపించారు. అయినప్పటికీ స్వయం ప్రతిపత్తి కలిగిన ఏపీ ఈఆర్‌సీ అటు ప్రభుత్వం సిఫారుసును, ఇక్కడి వినియోగదారుల అభిప్రాయాలను సైతం పక్కన పెట్టి తాజాగా ఈ నెల 7న ఆర్‌ఈసీఎస్‌కు లైసెన్స్ ఇవ్వలేమంటూ ఉత్తర్వులు విడుదల చేసిన సంగతి తెలిసిందే.

ఆర్‌ఈసీఎస్ పరిధిలో విద్యుత్ కనెక్షన్లు, లైన్లు, సబ్‌స్టేషన్ల వివరాలు...

విద్యుత్ సేవలు అందిస్తున్న ప్రధాన గ్రామాలు	104
మొత్తం ఆవాస గ్రామాలు	68
మొత్తం సెక్షన్లు	03
విద్యుత్ ఉప కేంద్రాలు	08
మొత్తం విద్యుత్ కనెక్షన్లు	68,573
వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు	8,717
మొత్తం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు	1,310
ఎల్‌టీ విద్యుత్ లైను	1707.321కి.మీ
11 కేవీ విద్యుత్ లైను	841.001కి.మీ
మొత్తం 11 కేవీ ఫీడర్లు	31
ఆర్‌ఈసీఎస్ సేవలు అందిస్తున్న మండలాలు	చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల

1982 నుంచి కార్యకలాపాలు

1981లో గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(ఆర్‌ఈసీఎస్) రిజిస్ట్రేషన్ కాబడింది. 1982 సెప్టెంబర్ 15 నుంచి ఆర్‌ఈసీఎస్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అప్పటికి చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో 26 గ్రామాల్లో మాత్రమే విద్యుత్ సరఫరా సదుపాయం ఉండేది. కేవలం 60 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మాత్రమే ఉండేవి. అయితే నాలుగు దశాబ్దాల తరువాత ఆర్‌ఈసీఎస్ పరిధిలో భారీ స్థాయిలో విద్యుత్ సరఫరా విస్తరించింది. ప్రస్తుతం 68,573 విద్యుత్ కనెక్షన్లు ఉండగా 8,717 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

మూడే ఆర్‌ఈసీఎస్‌లు

ఇదిలా ఉండగా రాష్ట్రంలో కుప్పం, అనకాపల్లి, చీపురుపల్లిలో ఆర్‌ఈసీఎస్‌లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ మూడు ఆర్‌ఈసీఎస్‌లకు లైసెన్స్‌లు ఇవ్వలేమని ఏపీ ఈఆర్‌సీ స్పష్టం చేస్తోంది. శతశాతం విద్యుద్దీకరణ పూర్తయ్యిందని, విద్యుత్ బిల్లులు వసూలు విషయంలో ఏపీఈపీడీసీఎల్, ఆర్‌ఈసీఎస్‌లు రెండూ ఒకే విధానాలు అవలంభిస్తున్నాయని అలాంటప్పుడు ఆర్‌ఈసీఎస్‌లు ఇంకా ఎందుకు కొనసాగించాలని ఏపీ ఈఆర్‌సీ ప్రశ్నిస్తోంది. అంతేకాకుండా ఆర్‌ఈసీఎస్‌లో పటిష్టమైన విజిలెన్స్ వ్యవస్థ లేని కారణంగా లైన్ లాస్ భారీ స్థాయిలో జరుగుతున్న నేపథ్యంలో అదే స్థాయిలో భారాన్ని మోయాల్సి వస్తోందని ఏపీ ఈఆర్‌సీ చెబుతోంది.

ఏపీ ఈఆర్‌సీ లైసెన్స్‌ను తిరస్కరించింది



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పక్కన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- లైసెన్స్ ఇవ్వాలనే ప్రభుత్వం సిఫారను చేసింది
- కాలానికి అనుగుణంగా సంస్కరణలు సహజం
- చీపురుపల్లి ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వం
- మరోసారి ప్రభుత్వం, ఏపీ ఈఆర్‌సీ దృష్టికి తీసుకెళ్తాం..
- టీడీపీ అర్థం లేని ఆరోపణలు మానుకోవాలి
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్)కు లైసెన్స్ తిరస్కరణ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిక్ రెగ్యులేటరీ కమిటీ(ఏపీ ఈఆర్‌సీ) నిర్ణయమని, ఆర్‌ఈసీఎస్‌కు లైసెన్స్ ఇవ్వాలని ప్రభుత్వం సిఫారసు చేసిందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. శతశాతం విద్యుద్దీకరణ లక్ష్యాలతో ఆర్‌ఈసీఎస్ నాలుగు దశాబ్దాల కిందట ఏర్పడిందన్నారు. అందులో భాగంగానే స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నేతృత్వంలో 2004 నుంచి ఇంతవరకు ఆర్‌ఈసీఎస్ పరిధిలో వినియోగదారులకు, రైతులకు ఎంతో ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆర్‌ఈసీఎస్ పరిధిలో 8 విద్యుత్ ఉప కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నామని, 8717 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు రైతులకు ఇవ్వగలిగామన్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి హయాంలో రాజీవ్‌గాంధీ గ్రామీణ విద్యుద్దీకరణ యోజన(ఆర్‌జీజీవీవై) పథకంలో భాగంగా రూ.8 కోట్లు నిధులతో విద్యుత్ పరమైన అభివృద్ధి పనులు జరుపుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఆర్‌ఈసీఎస్‌కు లైసెన్స్ పునరుద్ధరించాలని స్థానిక ప్రజాప్రతినిధుల కోరిక మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి అనుమతుల కోసం ఏపీ ఈఆర్‌సీకు ప్రభుత్వం సిఫారుసు చేసిందన్నారు. శతశాతం విద్యుద్దీకరణ పూర్తవ్వడం, ఆర్థిక భారం, లాభ నష్టాలు, ఇతర కార్యకలాపాలు దృష్ట్యా ఏపీ ఈఆర్‌సీ లైసెన్స్ మంజూరును నిరాకరించిందన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఏపీ ఈఆర్‌సీ నిర్ణయాన్ని గౌరవించాల్సి ఉందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఒకటే ఎలక్ట్రిక్ బోర్డు ఉండగా దానిన్ని రెండుగా విభజించి ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కోలుగా మార్చిన విషయాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. ఆర్‌ఈసీఎస్‌కు లైసెన్స్ మంజూరు విషయంలో ఏపీఈఆర్‌సీ ఆన్‌లైన్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిందని, అయినప్పటికీ రాష్ట్రంలో ఉన్న మూడు ఆర్‌ఈసీఎస్‌ల్లో ఆర్థిక భారం దృష్ట్యా లైసెన్స్ తిరస్కరించిందన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 31 మండలాల్లో ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ సేవలు అందుతుండగా చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో మాత్రమే ఆర్‌ఈసీఎస్ విద్యుత్ సేవలు అందుతున్నాయని చెప్పారు. చీపురుపల్లి ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వమని స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ద్వారా మరోసారి ప్రభుత్వం, ఏపీఈఆర్‌సీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష నాయకులు ఈ విషయాన్ని రాజకీయం చేయడం మానుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కెవి.సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, సువ్వాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

70 పైసలకే యూనిట్ విద్యుత్

ప్రభుత్వం రూ.5 నుంచి రూ.6 వరకు యూనిట్ విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక్కడ ఆర్‌ఈసీఎస్‌కు మాత్రం యూనిట్‌ను 70 పైసలకే సరఫరా చేస్తోంది. దీంతో ఒక్కో యూనిట్‌పై నెలకు రూ.5 వరకు భారం మోస్తోంది. ఈ లెక్కన ఆర్‌ఈసీఎస్ పరిధిలో ప్రతీ నెలా వినియోగించే లక్షల యూనిట్లకు రూ.కోట్లలోనే ప్రభుత్వం భారం మోయాల్సి వస్తోందని ఏపీ ఈఆర్‌సీ స్పష్టం చేస్తోంది.

నార్త్‌కోస్ట్ పరిధిలో..
మూడు గ్రీన్ ఎనర్జీ జల విద్యుత్ కేంద్రాలు

- తారకరామ తీర్థసాగర్‌లో సారిపల్లి నిర్వాసితులను నోటిఫై చేయాలని ప్రభుత్వ ఆదేశాలు
- రూ.77 కోట్లతో 1400 కుటుంబాలకు పరిహారం
- రూ.388 కోట్లతో మహేంద్రతనయ ఆఫ్‌షోర్ నిర్మాణానికి భూమి పూజ
- జల వనరుల శాఖ నార్త్ కోస్ట్ సీఈ సుగుణాకరరావు



మాట్లాడుతున్న జలవనరుల శాఖ నార్త్ కోస్ట్ సీఈ సుగుణాకర రావు

బొబ్బిలి: తారకరామ తీర్థ సాగర్ నిర్మాణంలో తరలిపోనున్న 1400 కుటుంబాలకు రూ.5.50లక్షల చొప్పున రూ.77 కోట్ల పరిహారం పంపిణీకి ఆయా కుటుంబాలను నోటిఫై చేయాలని ప్రభుత్వం కలెక్టర్‌కు ఉత్తర్వులు పంపిందని జల వనరుల శాఖ నార్త్ కోస్ట్ సీఈ శంబంగి సుగుణాకరరావు తెలిపారు. తోటపల్లి పనుల పర్యవేక్షణ నిమిత్తం శనివారం ఇక్కడకు వచ్చిన ఆయన బొబ్బిలిలో కాసేపు విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం ఈ కార్యక్రమం పూర్తవుతుందనీ, అనంతరం నిర్వాసితులకు పరిహారం పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే 53 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. కోరాడపేట, పడాలపేట, ఏటీ అగ్రహారం గ్రామాలకు రూ.174 కోట్లతో ఆర్‌ఆర్, ఎల్‌ఏ కోసం మంజూరు కాగా ఇందులో రూ.34 కోట్లు విడుదలైందనీ, వీటి ఖర్చు పూర్తయితే మిగతా బడ్జెట్ దశల వారీగా విడుదలవుతుందన్నారు. మహేంద్రతనయ ఆఫ్‌షోర్ నిర్మాణానికి భూమి పూజ జరిగిందన్నారు. ఇందులో రెండున్నర కిలోమీటర్ల రిజర్వాయర్, 13 కిలోమీటర్ల పొడవున నీటి మళ్లింపు కాలువ(ఫ్లడ్ ఫ్లో కెనాల్)తో పాటు 12 కిలోమీటర్ల ఎడమ కాలువ, 19 కిలోమీటర్ల కుడి కాలువ నిర్మిస్తామన్నారు. 24,700 ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు కూడా 600 మీటర్ల పొడవున టన్నెల నిర్మాణం చేపడతామన్నారు. నేరడి బ్యారేజి నిర్మాణం అంతర్రాష్ట్ర వివాదం కారణంగా ప్రత్యామ్నాయంగా రూ.135 కోట్లతో హిరమండలంలో 1400 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేయనున్నామన్నారు. ఇందుకోసం 19 టీఎంసీల నిల్వ ఉండే రిజర్వాయర్‌ను హిరమండలం వద్ద నిర్మించనున్నట్లు చెప్పారు. దీని వలన శ్రీకాకుళం జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. మరో పక్క తోటపల్లి కాలువపైన తెర్లాం మండలం లోచర్ల వద్ద 1700 ఎకరాలకు, బొబ్బిలి మండలం రాముడువలస వద్ద 1800 ఎకరాలకు సాగు నీరందించే రెండు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.43 కోట్లతో పనులు చేపట్టేందుకు త్వరలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు రానున్నాయని చెప్పారు. వీఆర్‌ఎస్, పెదంకలాం, వట్టిగెడ్డ, ఆంధ్ర, పెద్దగెడ్డ ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు వేసవి కాలంలోనే చేపడుతున్నామని, ప్రస్తుతం ఆ పనులు జోరుగా సాగుతున్నాయన్నారు.

మూడు గ్రీన్‌ఎనర్జీ జల విద్యుత్ కేంద్రాలకు అనుమతులు

విశాఖ నార్త్ కోస్ట్ పరిధిలో మూడు గ్రీన్ ఎనర్జీ జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి అవసరమయ్యే నీటిని మిగులు జలాల ద్వారా వినియోగించుకునేందుకు ప్రభుత్వం జీఓ విడుదల చేసినట్లు సీఈ సుగుణాకరరావు తెలిపారు. విశాఖ జిల్లాలో రెండు, విజయనగరం జిల్లాలో ఒకటి చొప్పున మూడు జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి రెండు సంస్థలు ముందుకు వచ్చినట్టు తెలిపారు. వేపాడ మండలం మారిక వద్ద రూ.2,440 కోట్లతో 600 మెగావాట్లు, విశాఖ జిల్లా చింతపల్లి మండలం యర్రవరం వద్ద రూ.2,500కోట్లతో 900 మెగావాట్లు, అదే జిల్లా అనంతగిరి మండలం పెద్దకోట వద్ద రూ.3,890 కోట్లతో 1000 మెగావాట్లతో మూడు జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి అవసరమైన మిగులు జలాలను వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టులు గ్రీన్ ఎనర్జీ తరహాలో నిర్మాణం కానున్నాయన్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఆయా గ్రిడ్‌లకు సరఫరా చేస్తాయన్నారు.

రూ.140 కోట్లతో ఉపాధి కాంపొనెంట్ పనులు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉపాధి హామీ చెరువుల లోతు పనుల కన్నా మెటీరియల్ కాంపొనెంట్‌కే ప్రాధాన్యత ఇచ్చేందుకు ఆదేశాలిచ్చామని సీఈ సుగుణాకరరావు తెలిపారు. ఇప్పటికే పార్వతీపురం, విజయనగరం ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. మెటీరియల్ కాంపొనెంట్ పనులకు వెంట వెంటనే బిల్లులు చేస్తున్నట్టు చెప్పారు. ఈ పనులను జల వనరుల శాఖ అధికారులు పర్యవేక్షించనున్నట్లు స్పష్టం చేశారు. మంజూరు ఉత్తర్వులు డ్వామా చూస్తుందన్నారు. కాలువల నిర్మాణం, గొలుసు కట్టు చెరువుల వాగులు, వనరుల అభివృద్ధికి ఈ నిధులు ఊతమివ్వనున్నాయని చెప్పారు.

జంఝావతి వివాదానికి ప్రభుత్వ ప్రత్యామ్నాయ చర్యలు

జంఝావతి రబ్బర్ డ్యాం వద్ద రూ.16 కోట్లతో ప్రొటెక్షన్ వాల్ నిర్మించి 540 స్ట్రక్చర్ల నిర్మాణంతో పూర్తి స్థాయి సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే పలుమార్లు ఒడిశా ప్రభుత్వానికి నిర్వాసితులతో గ్రామసభలు పెట్టాలని కోరినా స్పందించడం లేదన్నారు. అయినప్పటికీ జంఝావతి నిర్మాణానికి ఒడిశా నుంచి అవసరమైన 1200 ఎకరాల భూమికి పరిహారం ధరను నిర్ణయిస్తే చెల్లిస్తామని కూడా సమాచారం ఇచ్చామన్నారు. ఇందులో 800 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మరో 400 ఎకరాలు ప్రైవేటు భూములున్నాయన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, భూ సేకరణ పూర్తయితే పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. రూ.2,700 కోట్లు, రూ.1700 కోట్లతో రెండు ప్యాకేజీల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణమవుతుందన్నారు. ఉత్తరాంధ్రలో 8లక్షల ఎకరాలు సుజల స్రవంతి బృహత్తర పథకం ద్వారా సాగయితే అందులో ఉమ్మడి విజయనగరం జిల్లాకు దాదాపు 4లక్షల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయన్నారు.

ఓటు వేయడానికి సూచించిన
గుర్తింపు కార్డులివే..

- కలెక్టర్ సూర్యకుమారి



విజయనగరం అర్బన్:

జిల్లాలో ఈ నెల 13న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్ వద్ద గుర్తింపు కోసం ఓటర్లందరూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు కార్డు లేదా 12 రకాల ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సూర్యకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డు (ఈపీఐసీ)గాని ఈ దిగువ పేర్కొన్న 12 ప్రత్యామ్నాయ ఫోటో గుర్తింపు డాక్యుమెంట్లలో ఏదైనా ఒకటి సమర్పించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. గుర్తింపు కార్డులుగా ఆధార్ కార్డు, ఎంఎస్‌ఆర్‌ఈజీఏ జాబ్ కార్డు, బ్యాంక్/పోస్ట్ ఆఫీసు జారీ చేసిన ఫోటోగ్రాఫ్‌తో పుస్తకాలు, కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ అయిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐచే జారీ చేయబడిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోగ్రాఫ్ ఉన్న పింఛను డాక్యుమెంట్, కేంద్ర/ఎంఎల్‌ఏ/ఎంఎల్‌సీలకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డులు, భారత్ ప్రభుత్వ సామాజిక న్యాయం అండ్ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రత్యేక ఆసక్తిత గుర్తింపు కార్డు (యూనిక్ డిజిబిలిడీ ఐడీ)లను అనుమతిస్తారని పేర్కొన్నారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్


డిప్యూటీ సీఎంను సన్మానిస్తున్న నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ అప్పలకొండమ్మ


డిప్యూటీ సీఎం రాజన్నదొరతో పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ విక్రమ్

సాలూరు: స్థానిక పట్టణంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరను వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తానన్నారు. అనంతరం పట్టణ వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు, డీసీఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ తదితరులు విక్రమ్‌ను సన్మానించారు. అంతకుముందు డిప్యూటీ సీఎంను కూడా సత్కరించారు.

సాలూరు: డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.

పరారైన రిమాండ్ ఖైదీ అరెస్ట్


పట్టుబడిన రిమాండ్ ఖైదీతో పోలీసులు

రాజాం సిటీ: సరిగ్గా రెండు నెలల క్రితం పోలీసుల కళ్లు గప్పి, తప్పించుకుని పరారైన రిమాండ్ ఖైదీని రాజాం పోలీసులు విజయవాడలో అరెస్ట్ చేశారు. సదరు ఖైదీని శనివారం రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల ఎదుట హాజరుపరిచి, సీఐ కె.రవికుమార్ వివరాలు వెల్లడించారు. చీపురుపల్లి మండలంలోని పత్తికాయపాలవలస గ్రామానికి చెందిన పున్నాన రాంబాబును విజయనగరం వన్‌టౌన్‌లో కేసు నిమిత్తం జనవరి 12వ తేదీన పాలకొండ సబ్‌జైలు నుంచి విజయనగరం కోర్టులో హాజరుపరిచారు. తిరిగి అదేరోజు సాయంత్రం పాలకొండ సబ్‌జైలుకు తరలిస్తుండగా రాజాం బస్టాండ్‌లో పోలీసులను తప్పించుకుని పరారయ్యాడు. ఈ మేరకు అతడికి ఎస్కార్ట్‌గా వచ్చిన సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అప్పటి నుంచి రాంబాబుపై నిఘా ఉంచి, అన్ని స్టేషన్లకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ నెల 9వ తేదీన విజయవాడ కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో దొంగతనం చేస్తుండగా, స్థానికుల సహాయంతో అతడిని పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. అక్కడి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ వై.రవికిరణ్, సిబ్బందిని పంపించి, అరెస్ చేసి ఇక్కడికి తీసుకువచ్చామన్నారు. అతడిపై గతంలో రాజాం, చీపురుపల్లి, విజయనగరం వన్‌టౌన్, జామి, ఎస్.కోట పోలీస్‌స్టేషన్ల పలు దొంగతనాలకు సంబంధించి, కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఖైదీని రాజాం కోర్టులో హాజరుపరిచి, రిమాండ్ విధించడంతో పాలకొండ సబ్‌జైలుకు తరలించామని తెలిపారు.

జోగింపేట పంచాయతీకి జాతీయ పురస్కారం!


మాట్లాడుతున్న సర్పంచ్ సింహాచలం

సీతానగరం: మండలంలోని జోగింపేట పంచాయతీ జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు సర్పంచ్ కల్యంపూడి సింహాచలం తెలిపారు. శనివారం ఇదే విషయమై స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన గ్రామంలోని ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులు జరగడంతో ఈ గౌరవం దక్కిందన్నారు. దీనికి కారకులైన ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులకు కృతజ్ఞతలన్నారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. మున్ముందు కూడా ఇదే ఉత్సాహంతో పనిచేసి, గ్రామాన్ని ఆదర్శంగా నిలుపుతానన్నారు.

10 గడ్డివాముల దగ్ధం


తగలబడిపోతున్న గడ్డివాములు

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో 10 గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గ్రామానికి చెందిన శీర కాశినాయుడు, పైడినాయుడు, బిక్కిని వెంకన్నబాబు, యండమూరి త్రినాధ తమ పశువుల మేత కోసం సమీపంలోని కళ్లాల్లో గడ్డివాములు నిల్వచేశారు. అక్కడే ఉన్న విద్యుత్ తీగల కారణంగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి గడ్డివాములు కాలిపోయాయి. అప్రమత్తమైన స్థానికులు మంటలను ఆర్పివేసేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేటప్పటికి జరగాల్సిన నష్టం జరిగిపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను

పార్వతీపురం: గరుగుబిల్లి మండలంలోని ఉద్దవోలుకు చెందిన టి.శ్రీను అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శనివారం ఉదయం సద్దన్నం(చల్లంది) తిన్న తర్వాత పురుగుమందు తాగాడు. ఇదే విషయాన్ని ఆయన తన భార్య జానకికి తెలిపాడు. అప్రమత్తమైన ఆమె చుట్టుపక్కల వాళ్లను పిలిచి, మందు కక్కించే ప్రయత్నం చేసింది. అనంతరం వైద్యసేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. అతడి మరణానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

చింతచెట్టు పైనుంచి జారిపడి యువకుడి మృతి


అప్పారావు(ఫైల్)

సీతంపేట: చింతచెట్టు పైనుంచి జారిపడి ఊయక అప్పారావు(37) అనే యువకుడు మృతి చెందిన విషాద ఘటన మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మర్రిగూడ చెందిన అప్పారావు చింతబొట్టల కోసం వెలగాపురంలోని చింతచెట్టు ఎక్కాడు. బొట్టలు తీసిన తర్వాత చెట్టు దిగుతున్నప్పుడు ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. దీంతో తీవ్రగాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు దోనుబాయి ఎస్ఐ కిశోర్ వర్మ తెలిపారు. ప్రస్తుతం పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి మృతదేహం తరలించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం (24క్యా. 10గ్రా.)	56,150-00
బంగారం (22క్యా. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200